# సాలీడు

పొద్దంతా వరిపొలాల్లో కలుపు తీసి ఇళ్లకు చేరే వేళ్ళ. బురదలో దిగిన ప్పుడు అంటకుండా ఉండి కదలికలకు అనుగుణంగా ఉండ డానికి పొద్దున పోసిన గోసులను వదలకుండా, నవ్వుతూ, తుళ్లుతూ అత్తల ఆరళ్లనూ, ఆడ బిడ్డల ఆటుపోటు మాటలను చర్చించు కుంటూ, కొత్త కోడళ్లకు తమ తమ

మగలను ఎట్లా కొంగున కట్టేసుకోవాలో కొన్ని చిట్కాలను, మరికొన్ని కిటుకులను చెప్పుకుంటూ నడుస్తున్నారు.

ఒక్కొక్కరు తాము కొత్త రోజులు ఎలా గడిపిందీ, పాత పడుతుంటే ఎలా మెలిగి రోజూకో కొత్తదనాన్ని చవిచూస్తూ, రేపటి కోసం ఎలా ఎదురుచూసేది ఉవ్విళ్లూరిస్తూ చెపుతువుంటే కొత్త కోడళ్లు కొంటెగా చూస్తూ వింటూ నడుస్తువున్నారు.

పడమర సూర్యుడు కొలిమిలోని మూసలో కరుగుతున్న బంగారం ముద్ద హద్దు చెదురుతూ, పసిడి రంగును పరిచినట్లు ఆకాశాన్నే కాకుండా, అంత టా ఆరపోసిన సంధ్య. ఆ సంధ్యలో ఎగిరే పక్షులు, పరుగెత్తే పశువులు, కూసే పిట్టలు, తిరుగాడే ఉడతలు. బాట పొడుగూతా అరమరికలు లేకుండా మాట్లాడకుంటూ నడుస్తున్న ఆడవాళ్లు.

''రాత్రి మా ఆయన ముంతనిండా తియ్యటి కల్లు తెచ్చి పిడకల గూట్లో పెట్టిన అని, కాలు తొక్కి కనుసైగ సేసె.'' అంది అత్తమీది కోడలు. పాతికేళ్ల పడుచు, పేరు రాజి.

''ఆసేస్తే'' - అని అడిగింది మరో ప్రౌఢ స్త్రీ

''పిడకల కనిపోయి కొంత తాగిన.''

''ఆఁ''

''కుడితి కనిపోయి అయింత తాగిన.''

''ఆ తరువాత?''

''ఆర్రలకు పోయి పండుకున్న'' అంది రాజి, ముఖాన నవ్వుతో, ఒళ్లంతా సిగ్గుతో బుగ్గలకు చేతులానించుకుంటూ నడుస్తూ.

''ఇగ అంతే! మోటకు పోయేవరకు లేపిండట.'' బుగ్గల మీది చేతులను పెదాల మీదికి జరుపుకుంటూ అంది.

''ఛో.... ఛో ....?''

''లేపి లేపి ఎల్లిపోయిండు!''

''అయ్యో పాపం!''

''తెల్లారి రెండు బర్లది ఇది ఒకటే తాగుద్ది అంటూ కుడితి తొట్టి దగ్గర బర్రెను కొట్టిండు.''

''కండ్లు కనపడతలేవా! పెండను తీయరాదూ? అంటూ గుడ్లురిమి సూసిండు. నాకు నవ్వాగలేదు.''

''అంటే ఇద్దరి కోసం తెచ్చిన కల్లన్నమాట! ఛో.... ఛో.....!''

''తాగి యిగ నా సామి.....'' అంటూ మెత్తగా భుజాన్ని నొక్కింది.

''అట్లనుకోనే తెచ్చిండు గాని...'' అంటూ తన భర్త రూపాన్ని ఓసారి తలచుకోగా ఆమెను సిగ్గు ఊపేసింది.

''ఎక్కువ తాగితే నిద్రొస్తది.'' రాజి భుజం మీద చెయ్యి తీస్తూ.

''గట్లనే జరిగింది''.

''ఎంత పానం కొట్లాడిందో!'' ఓ కన్ను మూసి తెరుస్తూ అంది.

ఆమె ముఖంలో చూస్తూ తప్పదు అన్నట్టు కనురెప్పలు మత్తుగా ఆడిస్తూ ఏదో శబ్దం చెవిన పడగా వెనక్కు మళ్లి చూసి, ''అమ్మో! ఆడొస్తుండే'' అరటూ కేకేసింది.

గుండెల మీద చెయ్యేసుకుంటూ ఒకరి వెనక ఒకరు - అందరూ వెనక్కు మళ్లి చూశారు.

పరుగెత్తుకొస్తున్న గుర్రాన్ని, వెనక ముందు పరిగెత్తుకొస్తున్న మిగతా పదిమందినీ చూసే సరికి అందరి కళ్లల్లో బెదురు, గుండెల్లో గుబులు, ఒకరికొకరు ఆసరాగా పట్టుకుంటూ అందరూ బాటమ్మటే ఉన్న తీగ జిల్లేడి చెట్ల వైపు జరిగి నిలుచున్నారు.

ముందు ఓ అయిదారుగురు బరిసెలను చేత పట్టుకొని దొరబాబు కూర్చున్న గుర్రం వెనకాల మరో అయిదుగురు పరుగులాంటి నడక! అందులో ఒకడు పళ్లు ఇకిలిస్తూ, మరొకడు కళ్లను అదో మాదిరిగా కదిలిస్తూ చూశారు. దొర తన గుర్రాన్ని రాజికి ఎదురుగా కాసేపు ఆపి ఆమెను ఎగాదిగా చూసి కళ్ళేన్ని కదిలించాడు. గుర్రం ముందలి కాళ్లను పైకెత్తి సకిలించి, ఆ తరువాత ఊరివైపు పరుగే పరుగు.

గుండెల మీద చేతులేసుకుని ఊపిరి బిగపట్టి నిల్చున్న ఆడవాళ్లంతా వాళ్లు దాటిపోగానే కళ్ళను ఓసారి మూసి తెరిచారు, ఇంతకుముందు చూసిన భయానక దృశ్యం తమ కళ్లముందు నుండి చెదిరిపోవటానికి.

••••

ఊరిలో కుక్కలు అటూ ఇటూ పరిగెత్తుతువున్నాయి. రచ్చబండవైపు పరుగెత్తుకొస్తున్న గుర్రాన్ని, వెంట వస్తున్న ఆ గుంపును చూసి వేప, చింతచెట్ల మీది కాకులు కావు కావుమంటూ అరుస్తున్నాయి. దొరబాబు వస్తున్న అలికిడిని గ్రహించిన రంగారావు తన అనుయాయులతో ఎదురేగి స్వాగతం చెపుతూ, చేతిలోని తుపాకీని ఎంతో వినయంగా తీసుకుంటూ తల వంచి, తన మర్యాదను ప్రకటించుకున్నాడు. అంతేకాదు, గుర్రపు కళ్లాన్ని పట్టుకుని నడిపిస్తూ, తాను దాని పక్కమ్మటే రచ్చబండ వరకూ నడిచి, కుడిచేతిని అందించి దొరబాబును దించాడు.

దొరబాబు అరవై ఊళ్లకు అధిపతి. ఆయన రామచంద్రారెడ్డి దొర గారి ముద్దుల కొడుకు. పట్టుమని పాతికేళ్లు లేని ఈ చిన్న దొర చేసేవన్నీ దోపిడీలు, దౌర్జన్యాలు, మానభంగాలు. ఇవే కాకుండా ఎవరైనా ఎదిరిస్తే వాడు, వాని నిశాని, వాని ఆస్థిపాస్తులు బూడిదే! ఈ దుశ్చర్యలను పెద్ద దొర దృష్టికి తెచ్చినా ఎన్నడూ, ఎప్పుడూ తన కొడుకును దండించలేదు.

ఆయనది ధృతరాష్ట్రుని ప్రేమ. తండ్రి మనస్సు. తమ ఆస్తి అధికారాలు, కొలతల కందని పట్టాభూములు, జాగీరు గ్రామాలు చిన్న దొరలో అహంకారాన్ని పెంచాయి. ఆ అహంకారమే అరాచకాలను చేయిస్తోంది.

అందువల్ల ఆయన మాటలకు ఎదురులేదు. చేతలకు నిరసన లేదు. తన కిష్టమున్న ఊరు వెళతాడు. తనకు ఇష్టమున్న పనులు చేస్తాడు. ఆయన తుపాకీ ఎప్పుడూ గుళ్లను నింపుకునే ఉంటుంది. ఖాళీ అయిన వెంటనే మళ్లీ నిండుతూనే ఉంటుంది. ఆయన కొందరిని కోపంతో కాల్చేస్తే, ఎక్కువమందిని సరదా కోసం కాల్చేస్తాడు. మనిషిని మనిషి చంపడంలో ఉండే సరదా ఆయనకే తప్ప మరెవరికీ తెలియదు. ఆయన తుపాకీ దసరానాడు పిల్లవాని చేతిలోని పిస్తోలులాగ పేలుతూ ఉంటుంది. పేలినప్పుడల్లా ఓ నిండుప్రాణం నేలకూలడం, ఓ ఇల్లాలి పసుపు కుంకుమ మంట కలవటం, ఆ ఊళ్లో ఓ ఇల్లు పడిపోవడమే!

అలా చంపి ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు - ''ఇయ్యాల ఎన్ని పిట్టలా?'' అని అడిగినప్పుడు తన అనుయాయులు 'ఇన్ని' అని వేళ్లు చూపించడం మామూలు. చంపడం, చావులను లెక్క వేసుకోవడం వాళ్లకు ఓ ఆటగా అయింది. ఎక్కడైనా ఓ అందమైన ఆడది కనిపిస్తే ఆ రాత్రి ఆమె తన మగనితో ఉండడానికి వీలు లేదు. కాదంటే మరునాడు కనిపించదు.

••••

ఆ రాత్రి రంగారావుగారి భవంతిలోని ఓ ప్రత్యేక గదిలో మంచిగంధం వాసన గుమాయిస్తోంది. పెట్రోమాక్స్ లైట్ తెల్లని కాంతిని చల్లుతువుంది. దొరబాబు తన కోర మీసాలను దువ్వుకుంటూ, తెరచి ఉన్న దర్వాజా వైపు చూస్తూ, తనలో తాను తన దర్జాను తలుచుకుంటూ ముసిముసిగా

నవ్వుకుంటూ పట్టెమంచం మీద ఒరిగాడు. తానున్న గదివైపు వస్తున్న మట్టెల చప్పుడు, తన దగ్గరకే వస్తున్న గాజుల సందడి విని కోరికతో ఒళ్లు విరుచుకున్నాడు. కామంతో కళ్లు మూసి తెరిచాడు. ఎదురుగా పాలు, పండ్లతో ఓ స్త్రీ!

''ఓసి నువ్వా?''

''ఆఁ'' అంటూ నవ్వుతూ కళ్లు టపటపలాడించింది ఆ ఇంటి దాసీ, తాను తెచ్చిన పళ్లెం మంచం పక్కన ఉన్న టేబుల్ మీద ఉంచి పళ్లెంలోని అత్తరుపాయను ఆయన చెవి మడతలో ఉంచి, వేలిని ఎదమీద రాస్తూ ఆమె ఒంగినప్పుడు ఆమెను మత్తుగా చూస్తూ, ''పూలకంటే మొగ్గలే బాగుంటాయి'' అంటూ ఆమె ఎదను మొరటుగా తాకాడు. ఆమె బరువుగా శ్వాస పీలుస్తూ శృంగారంగా చూసింది. ఇష్టమున్నా, లేకపోయినా దొరల ఇళ్లల్లో దాసీలు అలా చూడాల్సిందే.

''ఇంతాలిస్యం?'' కర్కశంగా దొర గొంతు.

''వస్తది''

''తీసుకురా, పో!'' గద్దింపుగా.

సరే అన్నట్లు తల ఊపి బయటకు నడిచింది. కొంతసేపు తరువాత ''సావనన్న సస్తాను కాని, నేను రాను!'' అంటున్న యువతిని బలవంతంగా తీసుకొచ్చి గదిలోకి నెట్టి తలుపు మూసి ''అమ్మయ్య అంటూ అక్కడే నిలుచుంది గడియమీద చేయి ఉంచి.

గదిలో దొరబాబు ''రాయే!'' అంటూ గద్దింపు.

''వద్దు వద్దు!'' అంటూ ఏడుస్తున్న ఎక్కిళ్లు,

ఏదో చర్‌ర్‌న చినిగిన సవ్వడి.

దాసి ఓసారి తన రవికను తడిమి చూసుకుంది.

''సరే నంటే సావులేదు, కాదంటే కండ్లు మూస్తవు.''

దుఃఖాన్ని మింగుతున్న శ్వాస చప్పుడు.

''ఇంకా ఇదెందుకు?'' అంటూ జాడిచ్చి గుంజినట్టు వినిపించగనే, దాసి తన పింగులను అదిమి పట్టుకుని తాను పడుకునే గదివైపు పరుగెత్తినట్టు నడిచింది. చాపమీద కూర్చుని పేదింటివాళ్ల అద్వాన్నపు బతుకుల గూర్చి ఆలోచించసాగింది. గూట్లో చమురు దీపం చిన్నగ వెలుగుతూ ఉంది. బయట ఎక్కడినుండో ఎలుకను నోట కరచుకుని వచ్చిన పిల్లి గుమ్మి చాటున అదిమిపట్టింది.

••••

ఇంటికి నిప్పంటుకుంటే ముందు పొగ రాజి ఆ తరువాత వాడంతా మంటలు అంటుకున్నట్టు. రాత్రి బాబు దొర ఊళ్లోనే ఉండి మసక చీకట్లో వమాయమయిండని, వాకిళ్లు ఊడ్చుకుంటూ, కళ్లాపి చల్లుకుంటూ ఒకరి కొకరు చెప్పుకుంటున్న ఆడవాళ్లు.

''ఆడు రాత్రి ఊళ్లోనే ఉన్నడు అంటే ఏ ఇంటికి నిప్పు పెట్టిండో?'' అంటూ కొంగును తల చుట్టూ కప్పుకుని చివరను నోట్లో పళ్ల మధ్య పట్టి రెండు చేతుల్లోను పేడముద్దను పట్టుకుని వస్తూ అంది, బాబు దొర సంగతి తెలిసిన ఓ అవ్వ.

''అంతే కాదు, కుక్కల్లా దొరలు ఊర్ల మీద పడితే దొరల పెండ్లాలు జీతగాండ్లతోని కాల్లు వొత్తించుకుంటారాయె'' అంది.

అది ఇది అనే లోపల మైసమ్మ గుడి పక్కన ఉన్న రైతు కూలి రామయ్య ఇంటిముందు ఏడుపులు, పెడబొబ్బలు. వాకిళ్లలో పొరకలు పారేసి , తలుపులు దగ్గరేసి, అందరూ రామయ్య ఇంటిముందు చేరుతున్నారు. ఇడుపున కూర్చుని దుఃఖిస్తున్నాడు రాజి మామ రామయ్య.

కోడలి ముఖాన్ని చేతిలోకి తీసుకుని శోకం పెట్టి ఏడుస్తున్నది అత్త సాలమ్మ. శవమైన తన భార్య ముఖాన్ని చూడలేక రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని రోదిస్తున్న భర్త చంద్రయ్య. ఊరు ఊరంతా కదిలొచ్చి వాకిట్లో దుఃఖిస్తూ నిలుచున్నారు. వాకిలినిండా గాలికి కొట్టుకొచ్చిన వరి గడ్డిపోచలు.

''నిన్న కలుపుకు పోయేటప్పుడే ఆని కన్ను పడ్డది'' అంటూ కంట నీరు పెట్టుకుంది ఏరాలు.

''గుర్రం మీద కూకోని మల్లి మల్లి సూస్కుంట పోయిండు వాని కడుపుగాల!'' అంది మరొకామె.

వీళ్లిద్దరూ నిన్న కలుపు నుండి వస్తూ మాట్లాడుకున్న వాళ్లలోని వాళ్లే.

''పాపం! మొన్న రాత్రి మొగుడు కల్లు తెచ్చిన సంగతి చెప్పి పడిపడి నవ్వింది సెల్లె!'' ఉబికొచ్చే కన్నీళ్లను మునివేళ్లతో తుడుచుకుంటూ అన్నది ఏరాలు.

''రాత్రి కారం కొట్టాలని పిలిపిచ్చిండట. అట్టనే అని దగ్గరకి తోలిండేమో! ఒప్పుకోనట్టుంది. సంపేసిండు. అడిగే దిక్కెవడు?'' అంది తొంభై ఏళ్ల రాజి పెద్దత్త బరువైన శ్వాస పీలుస్తూ, రెప్పలు కొట్టకుండా చూస్తూ - ఆ చూపుల్లో తాను చిన్ననాటి నుండి చూస్తూ వచ్చిన దొరలు పెట్టే బాధలు, బొమ్మల్లా కదలగా బాధగా నిట్టూర్చింది.

''తలకు పోసుకుని బొట్టుపెట్టుకొనిబజార్ల నడిస్తే సాలు, గద్దల్లా ఆలడమే! సిగలో పూలు పెట్టుకొని బజార్లో కొంగును రొండికి చుట్టుకొని నడుము సన్నగుండి, ఎద ఎత్తుండి పొలం పనులల్ల కనిపిస్తే సాలు, తోడేళ్లు పడ్డట్టే! ఈ గద్దలన్నీ నేల కూలేదెప్పుడో? ఈ తోడేళ్ళన్నీ నాశన మయ్యేది ఎన్నడో? ఈబక్కపానాలు బట్టకట్టేదెన్నడో? ఈపుట్టిచ్చినోడు ఎందుకు

పట్టించుకోడో? ఉన్నోనిపైవోసూపు? లేనోనిపైఇంకోసూపా? అన్యాయం! అన్యాయం!'' అంటూ నోరు కొట్టుకుంది. అప్పుడామె ముడుతలు పడి ముడుచుకుపోయిన కనురెప్పలు కన్నీటి చుక్కలను రాల్చాయి.

''పాపం! బిడ్డ పానం ఎంత తల్లడిలిందో? ఎదరొమ్ము నుండి ఒక గోలి, కంతల్నుంచి ఒకగోలి, వల్లంత జల్లడైంది!'' అంటూ కంట నీరు పెట్టింది ఎరుకలి ఎంకమ్మ.

ఈ కళ్ల కన్నీటికి బదులు నిప్పులు రాల్చేదెప్పుడో?

•1994
ఆంధ్రప్రభ
ఆగస్టు '95